




# దేవుడి పిలుపు




పడక తిన్నగా కుదరక అటు నుండి ఇటు ఒత్తిగిల్లారు అప్పిగాడు. తల కింద పెట్టుకొన్న రాయి రోజూ కన్న మరీ గట్టిగా ఉన్నట్టు అనిపించింది. నడ్డి కింద కరకరమని నలుగుతున్న ఎర్ర కంకర పల్లేరుకాయల్లా గుచ్చుకోసాగింది.

నడి శీతాకాలం. చలి ఎముకల్ని కొరికేస్తోంది. పైగా రెండు రోజులై ఒకటే ఈదురుగాలి. చాలీ చాలని పైగుడ్డని ఎంతగా సాగదీసి కప్పుకొన్నా, ఒంటపట్టిన చలి అదుపులోకి రావడం లేదు. వెచ్చదనంకోసం కాళ్ళని బాగా ముడుచుకొని, డొక్కలో దోపుకొని పడుకోవడంతో ఒళ్ళంతా నొప్పులు పట్టుకొంది. చలికి నిద్ర తేలిపోయినా ఇంకా బద్ధకం మాత్రం వదలలేదు. ఒళ్ళు విరుచుకొని, లేచి కూర్చుని జేబులోంచి బీడీ ముక్క తీసి అంటించాడు. ఎవరో పెట్టి పుట్టిన అదృష్టవంతుల ఇంటి ప్రహారీ గోడకి ఆనుకొని కూర్చుంటూ, ఆకాశం వైపు చూసి, 'ఏ లెంతవుతాదో?' అనుకొన్నాడు.

ఆకాశం మేఘాల దుప్పటి కింద ముసలమ్మలా ముడుచుకు పడుకొంది. కన్ను పొడుచుకు చూసినా ఒక్క చుక్క అయినా అగుపించ లేదు. నిజానికి చుక్కల్ని చూసి వేళెంతయిందో చెప్పగల నేర్పు అప్పిగాడికి లేదు. అవ్వ దృష్టి బాగా ఉండే రోజుల్లో, రాత్రి ఏవేళప్పుడు అడిగినా ఒక్కసారి ఆకాశం వంక చూసి టైమెంతయిందో టక్కున చెప్పేసేది. ఒక్క అరగంట అటూ ఇటూగా అది సరిపోయేది కూడా.

అవ్వ చూపు పోయి ఆర్నెల్లయింది. అవ్వ కాళ్ళు పోయి అరవై ఏళ్ళకి పైగా అయింది. కావలసిన వాళ్ళంతా ఆకలి రక్కసికి బలైపోయి చాలాకాలం అయింది. అయినా, అవ్వ ఇంకా బ్రతుకుతూనే ఉంది. ఏ రోజు కా రోజే సరి అన్నట్టున్న ఆ ప్రాణం ఇంకా బొందిలో కొట్టు కొంటూనే ఉంది.

అవ్వ పేరు ముత్యాలు. "ముత్తవ్వా" అని పిలుస్తాడు అప్పిగాడు. అప్పిగాడికి ముత్తవ్వతో ఉన్న అనుబంధం రక్త సంబంధమైంది కాదు. కుల సంబంధమైంది కూడా కాదు. అది మాటికి మారు పొత్తూ ధన సంబంధమైంది. కాళ్ళు లేని ముత్యాలుకి మొగుడూ, కొడుకూ పోయాక మనిషి అవసరం పడింది. కడుపు మాడుతూ తిరుగు లాడుతున్న అప్పిగాడికి తిండి పెట్టే మనిషి కావలసివచ్చింది. అడవిలో ఉసిరికాయ, సముద్రపు ఉప్పు కలిసి రుచికరమైన ఊరగాయగా మారినట్టు అవసరం వారిద్దరి మధ్యా అవ్వా మనుమల సంబంధాన్ని సృష్టించింది.

ముత్యాలుని ఉదయాన్నే అది కోరిన చోటుకి చెక్కబండిమీద ఈడ్చుకుపోయి కూర్చోపెట్టడం, దాని టీనీళ్ళు, తిండి తిప్పలు వగైరా చూడ్డం, మళ్ళీ చీకటి పడేవేళకి ముష్టివాళ్ళ కాలనీగా పేరు గాంచిన ఆ పేవ్‌మెంటు మీదికి దాన్ని చేరవేయడం — ఇదీ అప్పిగాడు క్రమం తప్పకుండా రోజూ చెయ్యవలసిన పని. ఈ పనికి ప్రతిఫలంగా రోజూ తన కొచ్చే డబ్బుల్లో సగం వాటా వాడి కిస్తుంది ముత్యాలు. ఆ డబ్బులతో అప్పిగాడికి తిండికి డోకా లేకుండా గడిచిపోయేది. ఆదే పండుగ రోజో, పర్వదినమో అయితే నోరు తడుపుకోవడానికి కూడా నాలుగు డబ్బులు మిగిలేవి.

వాడి సొమ్ము వాడికి వాటా పెట్టగా, తన వంతు మిగిలిన సొమ్ముని నోట్లుగా మార్చుకొని, తన మొలలో ఉండే చిన్న గుడ్డ సంచీలో అతి భద్రంగా దాచు కొనేది ముత్యాలు. దేశంలో కరువు కాలు పెరిగి, మనుషుల్లో ధర్మబుద్ధి కొరవడే పరిస్థితి ఏర్పడేవరకు ఈ ఏర్పాటు ఇద్దరికీ లాభసాటిగా ఉంటూ వచ్చింది. దేశంలో తిండి గింజల ధరలు కనీ వినీ ఎరగనంతగా పెరిగిపోవడంతో సామాన్య సంసారుల చేతుల్లో దాన ధర్మాలకి పైసా మిగలక ముత్యాలు దిన సరి రాబడి బాగా పడిపోయింది. తను చేస్తున్న చాకిరీకి అది ఇస్తున్న సొమ్ము కిట్టుబాటుగా లేదని అప్పిగాడు విసు క్కొంటున్న సమయంలో, ముత్యాలుకళ్ళు కూడా పోవడంతో అసలు కథ మొద లయింది.

వయసు మునురుకొచ్చి రోగంతో బొత్తిగా పడక వేశాక ముత్యాలుకి కోపంతోపాటు కోరికలు కూడా రోజు రోజుకీ ఎక్కువ కాసాగాయి. అది చెయ్యలేదనీ, ఇది పెట్టలేదనీ రోజంతా అప్పిగాణ్ణి నోరు ముయ్యకుండా తిట్టి పోసేది. ముత్యాలు తనకి చూపకుండా రొంటిని దోపుకొనే ఆ చిన్న గుడ్డసంచీలో చాలా సొమ్ము దాచి ఉంటుందనే నమ్మకమే లేకుంటే, దాని కర్మానికి దాన్ని వదిలి అప్పిగాడు ఎప్పుడో పలాయనం చిత్తగించి ఉండేవాడు. ఇంతకాలం చాకిరీ చేసి, ఈక కాచి నక్కల పాలు చేసినట్టు, దానిని వదులుకు పోవడం బుద్ధి తక్కువ అనే అభిప్రాయంతో, అది ఎన్ని తిట్టినా ఎదురు చెప్పకుండా పడి ఉంటున్నాడు.

ముత్తవ్వ ఆ విధంగా మొలలో దాచిన సొమ్ము, అయిదో, పదో ఉంటే దానితో రెండు రోజులు మనసు తీరా ఇంత తాగి మజా చెయ్యవచ్చునీ, అలాకాక ఆ మొత్తం

## ద్వివేదుల విశాలాక్షి

వందో ఏభయ్యో ఉంటే దానితో ఏదో చిన్న వ్యాపారం లాంటిది ప్రారంభించి ఈ ముష్టి బ్రతుక్కి ఇంతతో మంగళం పాడాలనీ అప్పిగాడి అభిప్రాయం. ఆ ఆశ తోనే రోజు వెనక రోజుగా ముసిల్దాని చావుకోసం ఎదురుచూస్తూ కాలం గడుపు కొస్తున్నాడు అప్పిగాడు.

ఒంట్లో రోగం, కడుపులో ఆకలి, బయట చలి, ముసలి ముత్యాలుకి రాత్రి పూట సరిగా నిద్ర పట్టదు. ఇంకా మూడైనా కాకుండా లేచి కూర్చుం టుంది — "నెగరా, అప్పిగా, తెల్లారి పోనాది" అంటూ.


పల్లెటూళ్ళలో అయితే కోడికూతలు, పశువుల అలికిడి, పక్షుల అరుపులు రాత్రి తెల్లవారుతున్నట్టు తెలియజేస్తాయి. అదే పెద్ద పట్నాలలో అయితే మిల్లుకూతలు, పాల బళ్ళ చప్పుళ్ళు, పేపరు కుర్రాళ్ళ కేకలు తెల్లవారుతూంది లెమ్మని పట్నవాసులకు మేలుకొలుపు పాడతాయి.


ఇంకా నాలుగు కాకుండానే గవర్న మెంటు పాల సప్లయి వాన్ ఒకటి రోడ్డు అదిరేలా రొదచేస్తూ రోజూ ఆ పక్క వీథిలోంచి వెళుతుంది. ఆ ధ్వని చుట్టు పక్కల ఇళ్ళలో కాపురముండే ఇల్లాళ్ళకు, ముఖ్యంగా ఉదయాన్నే భర్తను ఆఫీసుకి, పిల్లల్ని స్కూళ్ళకి అంపకం పెట్ట వలసిన ఆడవాళ్ళకి ఒక అలారమ్ వంటిది. ఏ రోజైనా అది కాస్త వేళ తప్పించి వస్తే అటువంటి గృహిణుల దిన చర్య ఆనాడు అస్తవ్యస్తంగా తయారవుతుంది అన్నా అందులో ఆశ్చర్యపోవలసింది లేదు.

అంతవరకు మెల్లమెల్లగా అప్పిగాడికి మేలుకొలుపు పాడే ముత్యాలు ఆ బండి చప్పుడు వినడంతోనే తన కంఠాన్ని, పాడే తీరుని కూడా హెచ్చించి, "నెగరా ... నీ జిమ్మడ ... నోరెండి సత్తన్నా... కసిన్ని టీనీళ్ళు తెచ్చి గొంతులో పోయ్" అంటూ తిట్లకి తగులుకొంటుంది.

ఇంకా పూర్తిగా బద్ధకం వదలని పేవ్‌మెంటు వాసులకు అవ్వ తిట్లతో నిద్రాభంగం కాగా, అందుకు కారకుడైన అప్పిగాడి మీద విరుచుకుపడతారు. "అది గడించెట్టే సన్నాలన్నా పందిలా పడి తిన్నావు. ఇప్పుడు అది నోరెండి కాసిన్ని టీనీళ్ళు తెమ్మంటే నెగకుండా పల్లుక తొంగున్నావు ... మడిసై పుట్టాక ఇస్వాస ముండాల" అంటూ నీతులు చెపుతారు.

మరి కొంతసేపు అవ్వ తిట్లు, ముష్టి సమాజపు పెద్దల హితబోధలు వింటూ గడిపేసి, ఇంక లేవక తప్పదన్నట్టు అప్పుడు లేస్తాడు అప్పిగాడు. అరమైలు దూరంలో ఉన్న రాజులు టీ కొట్టు దగ్గరికి అంచులు విరిగిపోయి, సొట్టలు పడ్డ ఒక అల్యూమినియమ్ గ్లాసు పట్టు కొని, మనసులో ముసిల్దాన్ని తిట్టు కొంటూ బయలుదేరతాడు. ముత్యాలు టీ కోసం ఇచ్చిన డబ్బులు ముందురోజే బీడీలకి ఖర్చయిపోయి ఉంటాయి కాబట్టి రాజులు దయ తలిచి అరువు పోస్తే ఆ టీ నీళ్ళు తెచ్చి అవ్వ గొంతుకలో పోసి బయటపడ్డం, లేకుంటే ఆ పోవడం





ఇటీవల రాజమండ్రిలో జరిగిన నాటక పోటీలలో పాల్గొని 'తరంగాలు' నాటకానికి ఉత్తమ ప్రదర్శన, ఉత్తమ దర్శకత్వం, ఉత్తమ నటుడు, ఉత్తమ కారెక్టర్ యాక్టర్, ఉత్తమ నటి, ఉత్తమ రంగాలంకరణ, ఉత్తమ ఆహార్యం—మొత్తం ఏడు బహుమతులను గెలుచుకొన్న రావూజీ ప్రొడక్షన్స్ (విశాఖపట్టణం) బృందం

అలాగే ఉడాయించి మళ్ళీ జాము పొద్దెక్కాకనే అవ్వ దగ్గరికి రావడం.

అప్పిగాడు బీడీ ఆఖరి దమ్ము లాగి అవతల పారేయబోతూంటే, పక్కవీథి లోంచి పాల బండి రొద చేసుకుంటూ తరలిపోయింది. ముత్యాలు అంతవరకు నిద్ర లేవకుండా పడుకోవడం అప్పిగాడికి ఆశ్చర్యం కలిగించింది. 'ఈ యేల ముసిల్దాని కేటయింది? ఇంకా నెగనేదు' అనుకొన్నాడు.

వాడు అలా గోడకి చేరబడి మరో కునుకు తీసి లేచేసరికి కూడా ముత్యాలు ఇంకా అలాగే ముడుచుకొని పడుకొని ఉంది. చుట్టుపక్కల ముష్టివాళ్ళంతా ఎవరి పనులమీద వాళ్ళు వెళ్ళిపోయారు. చలికి ఉంగ చుట్టుకొని అలా పడుకొన్న ముత్యాలుని చూస్తే ఎందువల్లో ఆ రోజు అప్పిగాడి మనసులో జాలి పుట్టుకొచ్చింది. 'ఈ సలికి తట్టుకోనేక నానే సత్తన్నా — ముసిలిముండ ఎలా ఒరిత్తందో?' అనుకొన్నాడు. ఆ జాలి ఫలితంగానే, అది లేచి అడక్కుండా టీ ఎట్టుకు రావడానికి రాజులు కొట్టువైపు బయలు దేరాడు. ఆ రోజు అరువు పెట్టనని విసుక్కోకుండానే రాజులు టీ గ్లాసులో పోశాడు. "ముసిల్దాని కెలా ఉందేటి?" అంటూ ముత్యాలు ఆరోగ్యం గురించి పరామర్శ కూడా చేశాడు. ముసలి ముత్యాలు చస్తే అప్పిగాడు ధనవంతుడవుతాడు అన్న మాట ముందు రోజు ఎల్లయ్య వల్ల వాడు విని ఉన్నాడు. ఆ పలకరింపులోని అంతరార్థం అదే.

అప్పిగాడు టీ పట్టుకు వచ్చేసరికికూడా ముత్యాలు ఇంకా లేవలేదు. కదలక, మెదలక అలాగే పడి ఉంది. "ముత్తవ్వా! నెగవ్ ... టీ సల్లారిపోతంది" అంటూ అది తల మీదుగా కప్పుకొన్న చిరుగుల దుప్పటిని తొలగించాడు. అవ్వ నిద్ర పోవడం లేదు. దాని కళ్ళు పగిలిన పత్తికాయల్లా తెరుచుకొనే ఉన్నాయి. అవి అప్పిగాడి వంక రెప్పవెయ్యకుండా చూస్తున్నాయి.

"ఒసే ... ముత్తవ్వా ... సచ్చిపోనావుటే!" అన్నాడు అప్పిగాడు, దాని చెయ్యి పట్టుకొని కుదుపుతూ.

ఆ రాత్రి కురిసిన మంచంత చల్లగా ఉంది అవ్వ ఒళ్ళు. పక్కగా పడి ఉన్న కొయ్య దుంగంత గట్టిగా ఉంది దాని చెయ్యి.

అవ్వ చావుకోసం నెల రోజులుగా గంటలు, నిమిషాలు లెక్కపెట్టు కొంటున్నాడు అప్పిగాడు. వాడు ఎదురుచూసిన ఆ క్షణం వచ్చింది. కాని, ఏ కారణం గానో వాడికి కలగవలసినంత ఆనందం మాత్రం కలగలేదు. పైగా కళ్ళ వెంట రెండు నీటిబొట్లు అవ్వ శవంపై టపటప రాలాయి. "ముసిల్ది సెప్పా సెయ్యాకుండా సచ్చూరుకుంది" అంటూ తనలో తనే దిగులుగా గొణుక్కున్నాడు.

అప్పిగాడి స్వగతం విని బద్ధకంగా కళ్ళు నులుపుకొంటూ లేచి కూర్చున్నాడు ఎల్లయ్య. ఎల్లయ్య అప్పిగాడికి గురువులాంటి వాడు. ముష్టి విద్యలో గల సులువు బలువులు, మాయమర్మాలు అన్నీ వాడిదగ్గరే నేర్చుకొన్నాడు అప్పిగాడు. వయసుకి అప్పిగాడి కంటే ఏమంత పెద్ద కాకపోయినా, బుద్ధిలో ఎల్లయ్యదే పైచెయ్యి. ఆ ముష్టివాడలో ఎవరికి ఏ సమస్య ఎదురైనా "ఎల్లయ్యా" అంటూ సలహా కోసం వాడి దగ్గరికే వస్తారు అంతా.

"ఏట్రా, అప్పిగా, ముసిల్ది కునికేసిం దేటి?" అన్నాడు ఎల్లయ్య, కొద్దిగా ఆవులిస్తూ.

"యెప్పుడూ?" అన్నాడు దగ్గరికి వచ్చి దాని ముఖం చూస్తూ.

"నానూ ఉప్పుడే సూత్త" అన్నాడు అప్పిగాడు, పై గుడ్డతో కళ్ళు తుడుచు కొంటూ. ముసిల్దాని చావుకోసం అంతకాలం కాటి దగ్గర సిక్కలా కనిపెట్టుకొని కూర్చున్న అప్పిగాడు అలా కళ్ళు తుడుచుకోవడం చూసి 'ఇంకా పిన్నోడు. అనుభవం పోలదు' అనుకొన్నాడు ఎల్లయ్య.

పట్నం మేలుకొన్నా, ఇంకా రోడ్డు మీద అంతగా జనసంచారం లేదు. తప్పనిసరిగా బయటికి వచ్చిన వాళ్ళయినా ఎవరి తొందరలో వా ళ్ళున్నారు. పేవ్‌మెంటుమీద చచ్చి పడున్న ముసిల్దాన్ని కానీ, డబ్బుకోసం దాని మూట వెదుకుతున్న ఆ ఇద్దరు మిత్రుల్ని కానీ ఎవరూ గమనించలేదు.

అట్టే సేపు వెతక వక్కరలేకుండానే అవ్వ భద్రంగా దాచుకొనే గుడ్డ సంచీ దొరికింది. కాని, అందులో అప్పిగాడు ఆశించినట్లు వందా, పిదంయ్యా లేవు. అయిదూ, పదీ కూడా లేదు. అంతా కలిపితే రెండు రూపాయల లోపు చిల్లర డబ్బులు ఉన్నాయి. ముత్యాలు తన ఆర్జన ఆ సంచీలో కాక ఇంకెక్కడో దాచి ఉంటుందన్న అనుమానంలో శవాన్ని అటు ఇటు ఒత్తిగిల్లించి, కట్టుకొన్న బట్ట సడలించి చూశారు. తలకింద ఉన్న చింకి గుడ్డల మూట విప్పి చూశారు. కాని, ఫలితం లేకపోయింది. ఆ సంచీలో ఉన్న డబ్బులు మినహా దాని దగ్గర ఇంకో పైసా అయినా కనిపించలేదు.

ముత్తవ్వ దాచిన సొమ్ము అంతకన్న చాలా ఎక్కువగా ఉంటుందని అప్పిగాడి నమ్మకం. చూస్తే తను లాక్కొంటాడని, అది ఆ సొమ్మును ఇంకెవరి దగ్గరో దాచ పెట్టి ఉంటుందని వాడి అనుమానం. "సీ ... ముష్టి పంజ ... సేకిరి నాసే సెయించుకొని సొమ్మింం కేరికో మింగ

ముఖస్తుతి

ముఖస్తుతులతో పరస్పరం పొగుడుకుని, అభినందించుకునేవారు ఎవరిని వారు ఎదుటి వ్యక్తిని మోసగిస్తున్నామనే అనుకుంటారు, చివరికి ఎవరు మోసపోరు.

—కోట్లి

